క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంగాభవాని నెలపొంగళ్లు

పామూరు: మండలంలోని మోపాడు బంగ్లా వద్ద ఉన్న గంగామాత ఆలయంలో అమ్మవారి నెలపొంగళ్లు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగామాత మూల విగ్రహమూర్తికి, బొల్లావులకు విశిష్ట పూజలు నిర్వహించారు.

పేదలకు అన్యాయం చేస్తే సహించం

సీఎస్‌పురం(పామూరు): ఆక్రమణల తొలగింపు పేరుతో పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. సీఎస్‌పురంలో 167బీ జాతీయ రహదారిపక్కన శనివారం నాడు రెవెన్యూ అధికారులు పడగొట్టిన గుడిసెలు, తొలగించిన పునాదులను ఆదివారం సీపీఎం నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆక్రమణలకు గురయ్యాయంటూ అధికారులు చెబుతున్న ప్రాంతంలో రెవెన్యూ అధికారులు మరోమారు క్షేత్రస్థాయిలో పర్యటించి గుడిసెలు, బేస్మెట్లు వేసుకున్న వారిలో అర్హులను గుర్తించి వారికి అదేస్థానంలో పట్టా మంజూరు చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమంలో చేస్తున్న వేదపండితులు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడు వెలసిన మహారుద్రపీఠంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రెండో సందర్భంగా ఆలయంలో 1116 శివలింగాలకు 108 కలశాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మృత్యుంజయ హోమం నిర్వహించారు. హోమాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి



చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఉలవపాడు: విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీతికథలు, మహనీయల చరిత్ర, జనరల్ నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలు చదివించారు. గ్రంతాలయాలలో ఉన్న పుస్తకాలను పరిశీలించి అన్ని రకాల పుస్తకాలను చదవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో క్రీడలను ఆడించారు.

ఇసుక ట్రాక్టరుకు రూ.20 వేలు జరిమానా

సింగరాయకొండ: కొండపి మండలం కట్టుబడిపాలెంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌కు 20 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సెబ్ సీఐ నరహరి తెలిపారు. కట్టుబడిపాలేనికి చెందిన తలారీ వంశి ట్రాక్టరుతో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా గతంలో ఒకసారి రూ.10 వేలు జరిమానా విధించామని, రెండోసారి పట్టుబడటంతో రూ.20 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని కోరారు.

ఉత్తమ సేవకులకు జాతీయ పురస్కారాలు

కొత్తపట్నం: తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల గ్రహీతలకు ఉత్తమ జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కరీంనగర్ జిల్లాలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల్లో జాతీయ పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా విశ్వకళా విరాట్ బ్రహ్మ డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య, హాస్య నటులు ఆర్ఎస్ నంద, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, ప్రకాశం జిల్లా నుంచి జైభీమ్ క్యాన్సర్ ఇమ్యూనిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ బద్దెపూడి ప్రశాంతి ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. నృత్య, సేవ ఆచార్య యువ పురోహితులకు, సేవా రంగంలో ఉన్న కళాకారులకు, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. అనంతరం ప్రకాశం జిల్లాకు చెందిన బద్దెపూడి ప్రశాంతిని సన్మానించారు.

బస్‌పాస్‌ల కోసం ఇక్కట్లు



ఆర్టీసీ అధికారులు పాఠశాలలోనే విద్యార్థులకు పాస్‌లు అందిస్తున్న దృశ్యం (ఫైల్)



పాస్‌లు లేకుండా వెళుతున్న విద్యార్థులు

- గతంలో పాఠశాల వద్దే విద్యార్థులకు పాస్‌లు
- ఈ ఏడాది డిపో కౌంటర్ వద్ద పాస్‌ల జారీ
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

ఉలవపాడు: ఆర్టీసీ ద్వారా అందించే ఉచిత బస్‌పాస్‌ల కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాఠశాలల వద్దకు ఆర్టీసీ సిబ్బంది వచ్చి విద్యార్థులకు సంబంధించి పత్రాలను తీసుకుని ఐడెంటిటీ కార్డులు తయారు చేసి అక్కడే ప్రధానోపాధ్యాయుల సమక్షంలో పాస్‌లు ఇచ్చి వెళ్లేవారు. కానీ ఇప్పుడు దరఖాస్తు ఫారం నేరుగా కందుకూరు డిపోలోకి వచ్చి పాస్‌లు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో నియోజకవర్గంలోని పాఠశాలల విద్యార్థుల తల్లితండ్రులు ఈ పాస్‌లు తీసుకుని కందుకూరు డిపోకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ ద్వారా విద్యార్థులకు ఉచిత ప్రయాణం లభిస్తుంది. 18 ఏళ్ల లోపు బాలికలకు పదో తరగతి, ఇంటర్మీడియెట్ లోపు విద్యార్థులకు, బాలురకు 12 ఏళ్ల లోపు అంటే 7 వ తరగతిలోపు విద్యార్థులకు దరఖాస్తు ఫారం, రూ.50 చెల్లిస్తే విద్యా సంవత్సరం పూర్తిగా బస్‌లో ఉచిత ప్రయాణం చేయవచ్చు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఏప్రిల్ 30 వరకు ఈ బస్‌పాస్ అందచేస్తారు.

గత ఐదేళ్లు విద్యార్థుల చెంతకు

గత ఐదేళ్ల పాటు కందుకూరు ఆర్టీసీ అధికారులు నియోజకవర్గంలోని పాఠశాలలు మొత్తం తిరగడానికి ఇద్దరు నుంచి నలుగురు సిబ్బందిని కేటాయించేవారు. వారు నియోజకవర్గంలోని పాఠశాలలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులను కలిసి బయట గ్రామాల నుంచి పాఠశాలలకు వస్తున్న వారి వివరాలను తీసుకుని దరఖాస్తు ఫారం ప్రధానోపాధ్యాయులకు అందచేసేవారు. వారు దాన్ని పూర్తి చేసి సంతకం చేసి ఇచ్చేవారు. ఆ దరఖాస్తులు తీసుకుని ఆ సిబ్బంది వెళ్లి ఐడీకార్డులు, పాస్‌లు తయారు చేసి పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అందించేవారు. విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి దాతల చేత అందరికీ రూ.50 రూపాయలు ఒకరితో కట్టించి కూడా అందించిన పరిస్థితులు ఉన్నాయి.

ప్రస్తుత పరిస్థితి ఇదీ...

పాస్‌లు అవసరమైన విద్యార్థులు కందుకూరు డిపోలోని బస్‌పాస్ కౌంటర్ వద్దకు వెళ్లాలి. అక్కడ దరఖాస్తు ఫారం ఇవ్వాలి. వారు దాన్ని పరిశీలించి అక్కడే బస్‌పాస్‌లు అందిస్తారు. ఇలా నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు పనులు మానుకుని ఛార్జీలు పెట్టుకుని రావాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది పాఠశాలకు వచ్చి ఇచ్చే పాస్‌లను ఇప్పుడు ఎందుకు ఇలా తిప్పుతున్నారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలి

బస్‌పాస్‌ల సమస్యలు తీర్చాలని విద్యార్థులు, వారి తల్లితండ్రులు కోరుతున్నారు. మండల పరిధిలో ఒక మోడల్‌స్కూల్ ఆరు ఉన్నతపాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు కలిపి సుమారు 960 పాస్‌లు ఇచ్చేవారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 7800 ఉచిత పాస్‌లను అందించేవారు. వీరంతా ఇప్పుడు కందుకూరు వచ్చి తీసుకోవాలంటే ఇబ్బంది, గతంలో వలే పాఠశాలలకు సిబ్బంది వచ్చి ఇస్తే సమస్య ఉండదని విద్యార్థులు కోరుతున్నారు.

అవయవదానంతో అభాగ్యులకు పునర్జన్మ

- ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలి

కందుకూరు: మరణించిన తరువాత అవయవదానం చేయడం వల్ల జీవించి ఉండి వివిధ వ్యాధులు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారికి పునర్జన్మ ప్రసాదించవచ్చని అమ్మనేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం అన్నారు. స్థానిక జనార్దనస్వామి కళ్యాణ మండపంలో నేత్ర, అవయవదానంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మానవ శరీర అవయవాలను, కణజాలాన్ని మార్చగలిగే నైపుణ్యం సాధించడం వైద్యరంగం సాధించిన విప్లవాత్మక విజయమని, కొన్ని దశాబ్దాల పాటు శాస్త్రవేత్తలు, డాక్టర్‌ల కృషి ఫలితమే నేటి అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు అని వివరించారు. దేశంలో లక్షలాది మంది కార్నియా సమస్యతో బాధపడుతూ కంటి చూపులేకుండా జీవిస్తున్నారని, అటువంటి వారికి మరణించిన వారి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరలింగం

కార్నియాను తీసి అమర్చడం వల్ల చూపును ప్రసాదించవచ్చుని వివరించారు. వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులతో మరణించిన వ్యక్తి కార్నియాను సేకరించి నలుగురికి కంటి చూపును ప్రసాదించవచ్చునని వివరించారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి గుండె, కిడ్నీ, కాలేయం, లివర్ లాంటి అవయవాలను సేకరించి అవసరం ఉన్నవారికి ఇవ్వవచ్చునని దీని వల్ల మరణించినా కూడా చిరంజీవులుగా మిగిలిపోవచ్చునని తెలిపారు. రక్తదానం, నేత్రదానం, అవయవదానం, చర్మదానం, శరీరదానం చేయడం వల్ల శాస్త్ర, సాంకేతిక, వైద్య, విజ్ఞాన రంగాలకు ఎంతో మేలు చేసినవారు అవుతారని వివరించారు. ఉపాసకులు గాండ్ల హరిప్రసాద్, షేక్ నబీషా, షేక్ అహ్మద్, చనమాల బాలాజీ అవయవ దానం చేసేందుకు తమ అంగీకారం వ్యక్తం చేశారు. అలాగే దమ్మచక్ర ఫౌండేషన్ ద్వారా అవగాహన, కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ జీవనధార సంస్థకు నేత్ర, అవయవ, శరీర దానాలను చేసిన వారి వివరాలను అందిస్తామని ప్రముఖ జియాలజిస్టు పి శేషగిరిరావు తెలిపారు. న్యాయవాది ముప్పవరపు కిశోర్, రావులకొల్లు బ్రహ్మానందం, డాక్టర్ తన్నీరు మల్లిఖార్జున, చనమాల కోటేశ్వరరావు, ముతకాని లక్ష్మీనారాయణ, పోకూరి కోటయ్య, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి నవరాత్రి ఉత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి ఆలయం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కుందురు తిరుపతిరెడ్డి, కమిటీ నాయకులు

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్‌లో ఉన్న లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో జూలై 6 నుంచి 15వ తేదీ వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని కేటీఆర్ విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త, వ్యవస్థాపకుడు కుందురు తిరుపతిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయ కమిటీ నాయకులు నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. ఈసందర్భంగా కుందురు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ప్రతి రోజు అమ్మవారికి అభిషేకం, ఉదయం 9 గంటలకు చండీ హోమం, మధ్యాహ్నం 1 గంటకు మంగళ హారతి తీర్థప్రసాద వినియోగం సాయంత్ర 6 గంటలకు వారాహి అమ్మవారికి విశేషంగా సువాసినులచే సామూహిక కుంకుమార్చన, అనంతరం మంగళహారతీ తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పులి శ్రీనివాసులరెడ్డి, శింగరాజు మాలకొండేశ్వరరావు, మాకినేని సాయిరాం, ఉప్పాల సుబ్బారావు, మారెళ్ల ఉమాకాంత్, నున్నా కృష్ణా, ఈర్ల విజయరామరాజు, సుబ్బారెడ్డి, మాల కొండయ్య, రఘురామిరెడ్డి, శ్రీను, ఆడిటర్ ప్రసాద్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌కు ఘన సన్మానం

కొండపి(సింగరాయకొండ): ప్రభుత్వ ఉద్యోగి తన వృత్తిలో నిబద్ధత, విధేయత కలిగి ఉండాలని మాజీ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య పేర్కొన్నారు. ఆదివారం కొండపి గ్రంథాలయం లైబ్రేరియన్ కోటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. డీఎస్ఓ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. కోటేశ్వరరావు తన భార్య రజని కుమారి సహకారంతో 37 నేళ్లగా గ్రంథాలయంలో విశిష్ట సేవలు అందించారన్నారు. అనంతరం కోటేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ కొండపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, ఉపాధ్యాయులు, స్నేహితులు, పాఠకులు పాల్గొన్నారు.



కోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



అమ్మవారి నగరోత్సవంలో అర్చక స్వాములు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

- అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: స్థానిక మామిడిపాలెంలో వెలసిన గ్రామదేవతలు అంకమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఏడుగంటలకు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం అంకమ్మ మహాలక్ష్మమ్మలను అలంకరించి నగరోత్సవం నిర్వహించారు. దేవస్థానంలో మార్కాపురం శ్రీ విద్యా నృత్య కళామందిరం ఆధ్వర్యంలో జరిగిన సంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాగేంద్ర స్వామికి ఘనంగా పూజలు

చీమకుర్తి: సంతనూతలపాడులోని నాగేంద్ర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు ఆదివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు సాయిశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తికి ఆలయ అర్చకులు అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజ, గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వేటలు కోసి, నైవేద్యాలు సమర్పించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

పింఛన్ల పంపిణీ సమర్థవంతంగా నిర్వహించాలి

కందుకూరు: లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ పంపిణీ చేయాలని డీఎల్‌పీఓ కృష్ణమోహన్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గుడ్లూరు మండలంలోని మోచర్ల గ్రామ సచివాలయాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో ఉదయం 6 గంటల కల్లా పింఛన్ పంపిణీ ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ జాబితాలో ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ ఇవ్వాలని, మొత్తం రూ.7,000లను లబ్ధిదారులకు ఇవ్వాలని సూచించారు. సచివాలయ పరిధిలో పనిచేసే ఉద్యోగులంతా సచివాలయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఏ లబ్ధిదారుడికి ఇబ్బంది కలగకూడదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మోచర్ల సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

కందుకూరు: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపాలిటీలోని అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించాలని కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి సూచించారు. ఉదయం 6గంటలకు అన్ని వార్డు సచివాలయాల్లో పింఛన్ల ప్రారంభం కావాలన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సంతోష్‌నగర్ సచివాలయంలో జరిగే పంపిణీలో పాల్గొంటారని తెలిపారు. సచివాలయ సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండి పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించారు.

ఆయాలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్ జీతాలను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ అన్నారు. స్థానిక దర్శి చెంచయ్య భవనంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఇచ్చి ఆప్కస్‌లో చేర్చి పీఎఫ్ రికవరీ చేసి పనిభద్రత కల్పించాలన్నారు. ఆయాలంతా ఐక్యత, సమష్టిగా ఉన్నప్పుడే హక్కులు సాధన, సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. ఆయాల సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుచ్చిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జీఓ నం 108 ప్రకారం ఆయాలకు వేతనాలు పెంచాలని, ప్రస్తుతం నిత్యవసర ధరలకనుగుణంగా జీతాలు ఇవ్వాలని, ఆయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వై రవీంద్రబాబు, నాయకులు జీపీ రామారావు, జి.బాలిరెడ్డి, ఖాశింవలి, పవన్ కళ్యాణ్, పుట్టా సుబ్బారావు, సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ యాసీన్

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామ దేవత పోలేరమ్మతల్లికి భక్తులు ఆదివారం పొంగళ్లు పెట్టి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామ దేవత పోలేరమ్మతల్లి, బొడ్డురాయి సీతాలమాత తృతీయ వార్షిక మహోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు గ్రామంలో తిరునాళ్లను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మతల్లి తిరునాళ్ల ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు మేళతాళాలతో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



ఆలయంలో పొంగళ్లు పెడుతున్న భక్తులు

నిబద్ధతతో పనిచేస్తే తగిన గుర్తింపు

కనిగిరి రూరల్: ఏ రంగంలోనైనా నిబద్ధతతో పనిచేస్తే తగిన గుర్తింపు వస్తుందని ఎంఈఓలు యు వీ నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక పాతూరు పదోవార్డులో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పాలూరి రాజశేఖరరెడ్డి సన్మాన సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విధి నిర్వాహణలో నిబద్ధతగా, నిజాయితీగా పనిచేసి అందరి మన్ననలు పొందిన ఉపాధ్యాయుడు పాలూరి రాజశేఖర్‌రెడ్డి అని కొనియడారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కలువ విజయలక్ష్మి, కౌన్సిలర్లు సయ్యద్ రిజ్వానా ఖాలక్, పులి శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం ఆంజనేయరెడ్డి, భూతల పల్లి విజయ, పాలూరి రమణారెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర నాయకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాలూరి రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

7న హలో మాదిగ చలో ఈదుమూడి

మద్దిపాడు: ఈ నెల 7న ఈదుమూడి గ్రామంలో నిర్వహించనున్న మాదిగ జనజాతర కార్యక్రమంలో మండలం లోని మాదిగలందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఒనుకూరి పవన్‌కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం మద్దిపాడు ఎస్సీ కాలనీలో మాదిగ జనజాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్లు అయినందున పురిటిగడ్డ అయిన ఈదుమూడిలో మాదిగ జనజాతర ఏర్పాటు చేశామన్నారు. చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగ ఉపకులాలకు న్యాయం చేస్తానని హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని, ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సమస్య మాదిగల సమస్య కాదని మాల, మాదిగ, వారి ఉపకులాలకు సంబంధించిన సామాజిక న్యాయ సమస్య అని చెప్పారు. నాయకులు గండి జోసప్పు మాదిగ, ఒనకూరి రవి మాదిగ, కోటేసు, జాను పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుండెపోటుతో వీఆర్వో మృతి

వలేటివారిపాలెం (కందుకూరు): గుండెపోటు వీఆర్వో అకస్మాత్తుగా మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి వలేటివారిపాలెంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పి.సూరిబాబు(60) వలేటివారిపాలెం వీఆర్వోగా పనిచేస్తున్నాడు. వాస్తవానికి అతను ఆదివారం ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. అయితే శనివారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటుతో ఇంట్లోనే మృతి చెందాడు. అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని స్వగ్రామమైన పొదిలికి తరలించారు. దీంతో పలువురు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు సూరిబాబు మృతికి సంతాపం వ్యక్తం చేశాడు. మృతుడు సూరిబాబుకు భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.